క్లుప్తంగా

ఆత్మలింగేశ్వరాలయ సందర్శన



భక్తులతో మాట్లాడుతున్న వేదనాద జీయర్ స్వామి

పాల్వంచ: పట్టణంలోని ప్రముఖ శ్రీ ఆత్మలింగేశ్వరాలయాన్ని సోమవారం వేదనాథ జీయర్ స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎప్పుడు సన్మార్గంలో నడవాలని, ఆధ్యాత్మిక చింతన దిశగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పన్నుల రాయితీని సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులను ఈ నెల 30 వరకు చెల్లించి 5 శాతం రాయితీని పొందాలని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్లీబర్డ్ స్కీం ద్వారా 5 శాతం రాయితీని కల్పించడం జరిగిందని, ఇంటి పన్నులను మున్సిపల్ కార్యాలయంలో, మీ సేవ సెంటర్‌లో, ఇళ్ల వద్దకు వచ్చిన బిల్ కలెక్టర్లకు , వెబ్‌సైట్ నందు కాని చెల్లించవచ్చని పేర్కొన్నారు. రాయితీని సద్వినియోగం చేసుకోని పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు.

రంజాన్ తోఫా పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని రెండోవార్డ్ బూడిదగడ్డ బస్తీలో టీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫాలను ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు సహకారంతో సోమవారం సభ్యులు పంపిణీ చేశారు. రూ.50 వేలు ఖరీదు చేసే తోఫా సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌ఆర్ ట్రస్ట్ సభ్యులు తాండ్ర నాగబాబు మాట్లాడుతూ... ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు వారి తండ్రి నారాయణరావు పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మారెడ్ల నరసింహారెడ్డి, రావూరు వీరభద్రం, అక్కినేనిపల్లి ప్రేమ్, గోరె బాబు, పంతంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మల్లేష్

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం పంచాయతీ పరిధిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి తేపల మల్లేష్ సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అల్లూరి సెంటర్ వద్ద పోలీసుల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ ట్రాలీ ఆటోపై అనుమానంతో ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆటోలో ఐదు క్వింటాళ్ల రేషన్‌బియ్యం దొరకగా ఆటో డ్రైవర్ అక్కడి నుండి పరారయ్యాడు. బియ్యం, ఆటోను పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాఘవయ్య తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొర్రేడువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా దమ్మపేట రోడ్డులో ఎస్సై రాఘవయ్య ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో మూడు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్ తరలించి సీజ్ చేశారు. ఈమేరకు ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

డంపింగ్‌యార్డ్‌కు మోక్షమెప్పుడో!

- తెలంగాణ నగర్ యార్డ్‌లో బయో మైనింగ్ పనులు
- బంగారుజాల వద్ద యార్డ్ ఏర్పాటులో తాత్సరం
- ప్రతిపాదనల దశలోనే రహదారి నిర్మాణం
- రోడ్డు పూర్తయితేనే యార్డు పనుల్లో ముందడుగు



తెలంగాణ నగర్ వద్ద డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్ ద్వారా చెత్త సేకరిస్తున్న దృశ్యం

పాల్వంచ: మున్సిపాలిటీలో డంపింగ్‌యార్డ్ లేక ప్రజలు ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. కొన్నేళ్లుగా దమ్మపేట రోడ్డులోని తెలంగాణా నగర్ సమీపంలో గుట్టకు ఆనుకుని డంపింగ్‌యార్డుగా వాడారు. దీంతో అక్కడ వేల టన్నుల్లో చెత్త పేరుకుపోయింది. చెత్త కారణంగా సమీప తెలంగాణా నగర్, శివనగర్, అయ్యప్పనగర్, జయమ్మకాలనీ, శ్రీనివాసకాలనీల వారు, రహదారి వెంట ప్రయాణించే ప్రజలు నరకయాతన అనుభవించారు. చెత్త వల్ల నిత్యం దుర్వాసన వెదజల్లడం, చెత్తకు నిప్పు అంటిస్తుండటంతో దట్టమైన పొగ, మంటల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ డంపింగ్ యార్డ్ గుట్టకు ఆనుకుని ఉండటం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని చెట్టు సైతం కాలిపోతున్న పరిస్థితి నిత్యకృత్యంగా మారింది. దీంతో అక్కడ చెత్త వేయడాన్ని గత కొంత కాలంగా ప్రజలు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో తాత్కాలికంగా నిలిపివేసి చెత్తను పాత పాల్వంచ శివారుకు కొన్ని రోజులుగా తరలిస్తున్నారు.

మోక్షం కలిగేనా..?

ఎన్నో ఏళ్లుగా పట్టణానికి దూరంగా డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష నెరవేరడం లేదు. కాగా మున్సిపాలిటీ పరిధిలోని బంగారుజాల వద్ద మున్సిపాలిటీకి చెందిన 50 ఎకరాల మామిడి తోట, స్థలం ఉంది. దీన్ని డంపింగ్‌యార్డ్‌కు వినియోగించాలనే ప్రతిపాదన చేసి సంవత్సరాలు గడుస్తుంది. అయితే అక్కడ చెత్తపోయడానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ముందుగా రోడ్డు వేయాలనే ఆలోచనను అధికారులు చేశారు. ఈ క్రమంలో రూ.కోటి నిధుల కోసం ప్రతిపాదనలు చేశారు. ఈ నిధులు మంజూరు కాగానే రోడ్డు వేసి, డంపింగ్ యార్డ్‌ను అందుబాటులోకి తీసుకొస్తే తప్పా సమస్య కొలిక్కి వస్తుంది. ఈ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలను ముమ్మరం చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బయోమైనింగ్ ద్వారా చెత్త సేకరణ

తెలంగాణా నగర్ వద్ద ఉన్న డంపింగ్‌యార్డ్‌లో తాత్కాలికంగా చెత్త వేయడాన్ని నిలిపివేశారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న వేల టన్నుల చెత్తను తరలించడంపై అధికారులు దృష్టిసారించారు. ఈ క్రమంలో బయో మైనింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. దీని వల్ల మట్టి, ప్లాస్టిక్, పేపర్ ఇలా విడివిడిగా సేకరణ చేసి వాటిని తరలిస్తారు. అనంతరం డపింగ్‌యార్డ్‌ను ఖాళీ చేసి అందులో మున్సిపల్ పార్క్ ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఉన్నారు.

బంగారు జాల వద్ద యార్డ్ ఏర్పాటు..



తెలంగాణా నగర్ వద్ద డంపింగ్‌లో చెత్త వేయడాన్ని ఇటీవల నిలుపుదల చేశాం. అక్కడి చెత్తను బయో మైనింగ్ ద్వారా సేకరణ ప్రారంభించారు. తాత్కాలికంగా పాత పాల్వంచ శివారులో చెత్తను డంప్ చేస్తున్నారు. బంగారుజాల వద్ద మున్సిపాలిటీకి 50 ఎకరాల స్థలం ఉంది. అక్కడ శాశ్వతంగా ఉండేలా డంపింగ్‌కు ప్రతిపాదన చేశారు. అయితే సరైన రోడ్డు లేదు. రూ.కోటితో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నాం.

– ఎ.స్వామి, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ

సుజాతనగర్ ఎంపీపీ సీపీఐ కైవసం

- మద్దతు తెలిపిన కాంగ్రెస్ ఎంపీటీసీలు

సుజాతనగర్: సుజాతనగర్ ఎంపీపీ పదవి ఎట్టకేలకు సీపీఐని వరించింది. గత రెండున్నరేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారానికి సోమవారం తెరపడింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి డి.రమేష్ ఆధర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా 8 మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఏడుగురు హాజరయ్యారు. ఎంపీపీ పదవికి భూక్యా పద్మావతి ఒక్కరే నామినేషన్ వేయగా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆరుగురు సభ్యులు ఆమెకు మద్దతు ప్రకటించారు.

అనితకు నిరాశే..

సుజాతనగర్ ఎంపీపీ విషయంలో వైస్ ఎంపీపీ బానోత్ అనితకు నిరాశే మిగిలింది. 2019లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో సింగభూపాలెం ఎంపీటీసీగా గెలుపొందిన భూక్యా విజయలక్ష్మి ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో విజయలక్ష్మి, బానోత్ అనిత(వైస్ ఎంపీపీ) చెరో రెండున్నరేళ్ల ఎంపీపీగా ఉండాలని అప్పటి ప్రజాప్రతినిధుల సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు 2022 ఏప్రిల్ నాటికే అనిత ఎంపీపీ కావాల్సి ఉన్నా.. అది కార్యరూపం దాల్చలేదు. రాసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని, ఎంపీపీ పదవి తనకు ఇవ్వాలని అనిత రెండున్నరేళ్లుగా డిమాండ్ చేస్తూనే మిగిలిన సభ్యుల సహకారంతో ఎంపీపీ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టించడంలో విజయం సాధించారు. అయితే ఆమె కావాలనుకున్న ఎంపీపీ కోరిక మాత్రం నెరవేరలేదు. స్థానిక ఎమ్మెల్యేగా సీపీఐకి చెందిన కూనంనేని ఉండడం, బీఆర్‌ఎస్ ఎంపీటీసీ ఒకరు సీపీఐలో చేరడం, కాంగ్రెస్, ఇతర ఎంపీటీసీలు సైతం మద్దతు తెలపడంతో చివరకు సీపీఐకి చెందిన భూక్యా పద్మావతి ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని ఆమెను అభినందించారు.



ఎంపీపీగా ఎన్నికైన భూక్యా పద్మావతితో ఎంపీటీసీ సభ్యులు

నేడు లేక్ వ్యూ పార్క్‌లో పంచాంగ శ్రవణం

ఇల్లెందు: తెలుగు వారి తొలి పర్వదినం ఉగాది పండగ సందర్భంగా ప్రతీ పల్లెలో పంచాంగ శ్రవణం నిర్వహించటం ఆనవాయితీ. ఈ మేరకు ఇల్లెందు మున్సిపాలకులు పట్టణంలోని చెరువు కట్ట శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం లేక్ వ్యూ పార్క్‌లో పంచాంగ శ్రవణం కార్యక్రమం ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిసారి పార్క్‌లో ఘనంగా ఏర్పాట్లు చేసి పట్టణ ప్రముఖులను, ప్రజాప్రతినిధులు, పట్టణ పురప్రముఖులను రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమంను నిర్వహిస్తున్నారు. సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణ కార్యక్రమంతో పాటు ఉగాది పచ్చడి, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, భక్తులు హాజరుకావాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కోరారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...

ఇల్లెందులోని జేకే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి పంచాంగం శ్రవణం కార్యక్రమం ఉగాది పచ్చడి ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్యాంప్ ఆఫీస్ వర్గాలు తెలిపాయి.

భూవివాదంలో ముగ్గురిపై కేసు

పాల్వంచరూరల్: భూవివాదంలో చంపుతామని బెదిరించిన ముగ్గురిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామ శివారులో దాసరి పద్మ తన భూమిలో ఈనెల 1న కొలతలు వేయించుకునే ప్రయత్నం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన యాకూబ్, రుక్మోద్దీన్, మంజూరులు వెళ్లి వాగ్వాదానికి దిగారు. పద్మను తిట్టి చంపుతామని బెదిరించారని గాదే బాల శివకుమార్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

నంబర్ ప్లేట్లు లేకుంటే కేసులే..

కొత్తగూడెంటౌన్: నంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే వారిపై చీటింగ్ కేసులు నమోదు చేస్తామని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై నరేష్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డిలు అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం వన్‌టౌన్, త్రీటౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలపై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు గుర్తించి ఆవి నడిపిన వ్యక్తులపై చీటింగ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దొంగతనాలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న వారు నంబర్ ప్లేట్ లేని వాహనాలు వినియోగిస్తున్నారన్నారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నంబర్ ప్లేట్ లేక పోయినా నంబర్ టాంపరింగ్ చేసి చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



పట్టుబడిన వాహనాలతో ఎస్సైలు సరేష్, రమణారెడ్డి

ఈద్గాల్లో పనుల పరిశీలన



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గాలలో జరుగుతున్న పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి సోమవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ రోజున ఈద్గాలకు ముస్లింలు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రార్థనలు చేస్తారు కాబట్టి వారికి సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపాలిటీ నుంచి అన్నీ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రార్థనాలకు సంబంధించి షామియానాలు, తాగు నీరు, పరిశుభ్ర వాతావరణం ఉండే విధంగా పనులు చేయిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ యూసఫ్, అన్వర్‌పాషా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొరం కోసం ఎదురుచూపులు..





సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సైడ్‌బర్మ్ పోయని సీసీ రోడ్డు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో రోడ్లు లేని గ్రామాలు ఉండొద్దనే ఉద్దేశంతో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య రూ.3.11 కోట్ల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లను మంజూరు చేయించి గత నెల 9న శంకుస్థాపన చేశారు. ఈజీఎస్, డీఎంఎఫ్ నిధులతో రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. రోడ్లు నాణ్యతగా నిర్మించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని ఎమ్మెల్యే స్పష్టంగా అధికారులను ఆదేశించారు. రోడ్లయితే వేస్తున్నారు కానీ రోడ్డుకు ఇరు వైపులా మొరం పోయాల్సి ఉంది. నేటికీ మొరం పోయకపోవడంతో ఆ రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న సమయంలో అదుపు తప్పి కిందపడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే సైడ్ బర్మ్ పోయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆశలు ఆవిరి..!

- సాయన్నపేట బీటీ రోడ్డు పనులు నిలిచి ఏడాది
- పనులు నిలిపివేసిన అటవీ అధికారులు



పనులు నిలిచిపోయిన సాయన్నపేట బీటీ రోడ్డు

టేకులపల్లి: ఎన్నో ఏళ్లుగా బీటీ రోడ్డు కోసం ఎదురు చూస్తున్న ఆగ్రామ ప్రజలు ఆశలు ఆవిరయ్యాయి. మండలంలోని తొమ్మిదోమైలతండా పంచాయతీ పరిధిలోని సాయన్నపేటకు గ్రామానికి దశాబ్దాలుగా ఎదురుచూసిన బీటీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. దశాబ్దాలుగా ఈ గ్రామస్తులు ఎదురుచూస్తున్న పక్కారోడ్డు ఎట్టకేలకు ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.70 లక్షలతో బీటీ రోడ్డు మంజూరైంది. గతేడాది ఏప్రిల్ 10న అప్పటి ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు కూడా ప్రారంభించారు. రోడ్డును తవ్వి కంకర, సిమెంట్ మిక్సింగ్ వేసి లెవలింగ్ చేశారు. ఇక తారు పోసేలోపే ఇది ఫారెస్టుకు సంబంధించిందంటూ ఫారెస్టు అధికారులు రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేశారు. దీంతో సంవత్సరం నుంచి అనుమతులు లేక బీటీ రోడ్డు పనులు నిలిచిపోయారు. దీంతో సాయన్నపేట ఆదివాసీల ఆశలు ఆవిరయ్యాయి. ఇదే మార్గంలో ఊరి చివరిలో సుమారు మూడేళ్ల క్రితమే రోడ్డుపై కల్వర్టు నిర్మించారు. అప్పుడు మాత్రం అధికారులకు కనిపించలేదు కానీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే బీటీ రోడ్డు విషయంలో అభ్యంతరం తెలపడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం గుండానే కారేపల్లి, కామేపల్లి మండలాలతో పాటు ఖమ్మం పట్టణానికి పలువురు ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఐటీడీఏ ఏఈ సలార్ వివరణ కోరగా రోడ్డు నిర్మాణ పనులను ఫారెస్టు అధికారులు నిలిపివేశారని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అనుమతులు రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి



దశాబ్దాలుగా సాయన్నపేటకు బీటీ రోడ్డు కోసం ఎదురు చూస్తున్నాం. ఎట్టకేలకు గతేడాది రోడ్డు మంజూరైంది. రోడ్డు వేస్తున్నారు కదా అని చాలా సంతోషించాం. ఫారెస్టు అధికారులు అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయింది. ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ చూపించి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి.

– కొటెం కోటయ్య, సాయన్నపేట గ్రామస్తుడు

పెద్దమ్మతల్లి ఆలయం ముస్తాబు

నేటి నుంచి నవరాత్రోత్సవాలు

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం – కేశవాపురం గ్రామాల మధ్య కొలువైన పెద్దమ్మ తల్లి ఆలయంలో మంగళవారం నుంచి శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలు జరగనున్నాయి. ఉగాది సందర్భంగా ప్రారంభమయ్యే నవరాత్రోత్సవాలు ఈనెల 17వ తేదీ శ్రీరామనవమి వరకు కొనసాగుతాయి. ఈ మేరకు ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. కాగా, తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు జరగనుండగా తొలి రోజైన బుధవారం ఉదయం 9.30 గంటలకు కలశ పూజ నిర్వహించనున్నట్లు ఈఓ సుదర్శన్ తెలిపారు. ప్రతీరోజు అమ్మవారికి లలిత సహస్రనామార్చన, కుంకుమార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలు ఉంటాయని వెల్లడించారు.



పూలతో ముస్తాబు చేసిన ఆలయ ఆవరణ

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- డీఎంహెచ్‌ఓ శిరీష



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష

జూలూరుపాడు: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి కాన్పుల సంఖ్య పెంచేలా చూడాలని డాక్టర్‌ను ఆదేశించారు. ఔట్ పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి, వ్యవసాయ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. టీబీ శాంపిల్లను పీహెచ్‌సీకి తప్పనిసరిగా వైద్యసిబ్బందే పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ తేజస్విని, హెచ్‌వీ రాధిక, యూడీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా మెలగాలి



మాట్లాడుతున్న ఫాతిమా

కొత్తగూడెంఅర్బన్: కులమతాలకు అతీతంగా మెలుగుతూ, సుఖదు:ఖాలను సమానంగా పంచుకున్నప్పుడే సమాజంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరుస్తాయని జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్ శాఖ అధ్యక్షురాలు ఫాతిమా అన్నారు. సోమవారం రుద్రంపూర్‌లో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీచర్ల ఇఫ్తార్‌విందులో ఆమె మాట్లాడారు. సమాజ సంస్కరణలో కుల, మతాలకు అతీతంగా భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని, పవిత్ర ఖురాన్ అవతరించిన నెల రంజాన్ మాసం అని, ప్రతీ సంవత్సరం రంజాన్ ఉపవాసాలు మనిషిని మంచివారిగా మానవతా విలువలు కలిగిన మహోన్నతులు మారే శిక్షణ ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీషా, కృష్ణకుమారి, ప్రీతి ఫ్లారెన్స్, విజయలక్ష్మి, లక్ష్మీప్రసన్న, అనితా, సరస్వతి, సల్మా, పర్వీన్ సుల్తానా, నుసురత్, లతీఫా, జేబీషా, జమాత్ సభ్యులు షాహీన్, పర్వీన్‌బాను, షమీంపర్వీన్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోచింగ్ ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల పిల్లలకు స్కిల్ డెవలప్‌మెంట్ కోచింగ్‌ను ఏర్పాటు చేయాలని సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం టాధ్వర్యంలో సోమవారం ఎస్‌వోటూ డైరెక్టర్ పా వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి ప్రభావిత ప్రాంత పిల్లలు, అదేవిధంగా సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లల ఉన్నత చదువులు చదివిన స్కిల్ డెవలప్‌మెంట్ లేని కారణంగా ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ఈ క్రమంలో సింగరేణిలో ఎంతో నైపుణ్యత ఉన్న అధికారులతో శిక్షణ ఏర్పాటు చేస్తే ఉద్యోగాలు అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన అధికారి మీ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టిలో చర్చించి వీలైనంత త్వరలో పరిష్కారమార్గం చూస్తామని తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: వేసవి జాగ్రత్తలు తీసుకుంటూ వడదెబ్బపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో కొమరారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీరు, పళ్ల రసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లోహిత